క్లుప్తంగా

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

గన్నవరం: మండలంలోని కేసరపల్లి గ్రామ సచివాలయం-1లో సర్పంచి చేబ్రోలు లక్ష్మీ మౌనిక అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా దరఖాస్తుదారులకు కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాలను జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, తహసీల్దారు సీహెచ్ నరసింహారావు చేతుల మీదుగా అందజేశారు. ఆధార్ సేవల కోసం పెద్ద సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే మూల్పూరి బాలకృష్ణారావు, ఆర్ఐ ఉదయ్, ఈఓపీఆర్డీ ఏఎస్ఆర్ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మౌనిక పాల్గొన్నారు.

కారు ఢీకొని హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలు

పెనమలూరు: మండలంలోని పోరంకి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ గాయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం మేరకు.. రెండో బెటాలియన్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ రాయమాతల కిరణ్‌సత్రుసన్‌గుప్ పోరంకిలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరోలో పనిచేస్తున్నారు. అతను మంగళవారం పోరంకి వద్ద బందరు రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి మచిలీపట్నం వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో హెడ్‌కానిస్టేబుల్ గాయపడటంతో స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వేదపారాయణం ప్రారంభం

పెనమలూరు: మండలంలోని యనమలకుదురులో వేంచేసి ఉన్న శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం నుంచి నిత్యం వేద పారాయణం నిర్వహిస్తామని ఆలయ ఈఓ ఎం.గంగాధరరావు తెలిపారు. రోజూ ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు ఉప్పల వెంకటనిరంజన్‌శర్మ ఋుగ్వేదం, బుద్ధ సాయిఫణితేజశర్మ కృష్ణ యజుర్వేద పారాయణం చేస్తారని వివరించారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

చిన్నపిల్లలకు వ్యాక్సిన్లు

నున్న(విజయవాడరూరల్): స్థానిక ఒకటో సచివాలయం పరిధిలో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో బుధవారం పదేళ్లలోపు పిల్లలకు ప్రభుత్వ వైద్య సిబ్బంది వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణులకు గురకవాతం రాకుండా వ్యాక్సిన్లు చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు జ్వరం, మలేరియా పరీక్షలు చేసి మందులను అందచేశారు. ఏఎన్ఎం రజని పాల్గొన్నారు.

రోగి చెంతకే వైద్యసేవలు



నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ వైద్యురాలు విజయ గ్రామంలోని ఎస్సీ కాలనీలో పక్షవాతంతో బాధపడుతున్న నూతులపాటి విజయరాజు ఇంటికి వెళ్లారు. అతనికి వైద్య పరీక్షలు నిర్వహించి, రోగి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నాటు మందులను వాడుతున్నామని చెప్పగా, అవి వాడవద్దని, ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న నాణ్యమైన ఇంగ్లిషు మందులను మాత్రమే వాడాలని అతనికి సూచించారు. రోగికి అవసరమైన షుగర్, బీపీ, కొలెస్ట్రాల్ మందులను అందజేశారు. అనంతరం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత వెల్‌నెస్ సెంటర్‌కు వెళ్లి అక్కడకు వచ్చిన వారిని పరీక్ష చేసి మందులను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుబ్బలక్ష్మి, ఏఎన్ఎం శ్రీదేవి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఏడుగురు గంజాయి విక్రేతల అరెస్టు

పెనమలూరు: గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని పెనమలూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు కథనం మేరకు.. మండలంలోని పెదపులిపాక దళితవాడ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు దాడిచేసి గంజాయి విక్రయిస్తున్న కానూరుకు చెందిన సాలిగ్రామ్ యువరాజ్ ఆశిష్, కృష్ణలంకకు చెందిన షేక్ కరీముల్లా, యనమలకుదురు విశ్వశాంతినగర్‌కు చెందిన నిమ్మగడ్డ సుధీర్ కుమార్, మైలవరానికి చెందిన పి.భవానీశంకర్, అందే నాగవంశీ, కె.రోహిత్‌ను పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద 7.1 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు: మండలంలోని గంగూరు గ్రామానికి చెందిన బాలిక అదృశ్యం కావడంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు కథనం మేరకు.. గంగూరుకు చెందిన 16 ఏళ్ల బాలిక పోరంకిలోని ఓ రెస్టారెంట్‌లో పని చేస్తోంది. ఆమె ఈ నెల 10వ తేదీన పనికని రెస్టారెంట్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. తండ్రి రెస్టారెంట్ వద్దకు వెళ్లి కుమార్తె విషయం అడగ్గా ఆ రోజు పనికి రాలేదని యజమాని తెలిపాడు. దీంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్బీకేలతో రైతులకు ఆత్మవిశ్వాసం

- క్షేత్రస్థాయిలో రైతులకు విశేష సేవలు
- విత్తనం నుంచి పంట విక్రయం వరకూ ఆర్బీకేల్లోనే
- రైతులకు తోడుగా గ్రామ వ్యవసాయ అసిస్టెంట్లు



కాకులపాడు ఆర్బీకేలో రైతులకు విత్తనాలు అందిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలోనూ ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం (ఆర్బీకే) రైతుల జీవితాల్లో వెలుగులు నింపాయి. వారికి ఆత్మ విశ్వాసాన్నిస్తున్నాయి. విత్తనం ఎంపిక దగ్గర నుంచి పంట విక్రయం వరకు రైతన్న ప్రతి అడుగును చేయి పట్టుకుని నడిపిస్తున్నాయి. గ్రామగ్రామాన ఆర్బీకేలు రైతు నేస్తాలుగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో రైతులను విస్మరించారు. వారి కష్టాలను నిర్లక్ష్యం చేశారు.

ఆర్బీకేల్లో పలురకాల సేవలు

గతంలో రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించటానికి మండల కేంద్రానికి పరుగులు పెట్టాల్సి వచ్చేది. దీంతో సమయానికి సేవలు అందుకోవడం గగనమయ్యేది. కానీ ఇప్పుడు సొంత ఊళ్లలోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు కావటంతో వ్యవసాయంలో అన్నిరకాల సేవలను రైతులు సులభంగా పొందుతున్నారు. మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షలు, విత్తన శుద్ధి వంటి సేవలు మొదలుకుని పంట సాగు, రాయితీపై విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను కూడా సొంతూరులో ఆర్బీకేల్లోనే రైతులు పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా ప్రతి ఆర్బీకేలోనూ కనీసం 20 టన్నుల అన్నిరకాల ఎరువులను ఎల్లవేళలా రైతులకు అందుబాటులో నిల్వ ఉంచుతోంది. ఎలుకలు, చీడపీడల నివారణకు సలహాలు, సూచనలు, తెగుళ్ల నివారణకు ముందస్తు జాగ్రత్తలపై రైతులకు తెలియజేస్తున్నారు. పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వాతవరణ పరిస్థితులను రైతులకు సవివరంగా తెలియజేసేందుకు యూట్యూబ్‌లో ఆర్బీకే చానల్ వీడియోలు ద్వారా చైతన్యం కలిగిస్తున్నారు. విత్తనాలు, ఈ-క్రాప్ నమోదు, కౌలురైతులకు సీసీఆర్‌సీ కార్డులు, ఉచిత పంటల బీమా వంటి సేవలపే ఆర్బీకేల్లో అందిస్తున్నారు. రైతులు నష్టపోకుండా ఆర్బీకేల్లోనే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి, రైతుల నుంచి వరి, మొక్కజొన్న వంటి పంటలను కొనుగోలు చేస్తున్నారు.



కానుమోలులో మట్టి నమూనాలను సేకరిస్తున్న గ్రామ వ్యవసాయ అసిస్టెంట్లు (ఫైల్)

బాపులపాడు మండలంలో ఆర్బీకేల సంఖ్య	: 22
మండలంలోని మొత్తం రైతుల సంఖ్య	: 18,560
రైతు భరోసా లబ్ధిదారుల సంఖ్య	: 10,518
నాలుగేళ్లలో రైతుభరోసా కింద మంజూరైన మొత్తం	: రూ.56.79 కోట్లు
ఆర్బీకేల ద్వారా పంపిణీ చేసిన ఎరువులు	: 7680 టన్నులు
రైతులకు అందించిన రాయితీ	: రూ. 5.60 కోట్లు
ఆర్బీకేల ద్వారా అందించిన విత్తనాలు	: 311 టన్నులు
విత్తనాల పంపిణీపై రైతులకు అందించిన రాయితీ	: రూ.57.04 లక్షలు
సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు పొందిన రైతుల సంఖ్య	: 110
వ్యవసాయ పరికరాలపై రాయితీ	: రూ. 1.32 కోట్లు
గత ఖరీఫ్‌లో ఆర్బీకేల్లో కొనుగోలు చేసిన ధాన్యం	: 34,026 మెట్రిక్ టన్నులు
ఆర్బీకేల్లో కొనుగోలు చేసిన మొత్తం ధాన్యం విలువ	: రూ.66.69 కోట్లు
ఉద్యాన పంటలపై సబ్సిడీ పొందిన రైతులు	: 4953
ఉద్యాన పంటలపై కలిగిన లబ్ధి	: రూ.4.38 కోట్లు

వెంటనే గుర్తుకొచ్చేది ఆర్బీకేలే



బాపులపాడు మండలం పెరికీడులో సుమారు పది ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాను. రైతు భరోసా కేంద్రాలు నాలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. వ్యవసాయంలో ఏ సమస్య వచ్చిన టక్కున గుర్తుకువచ్చేది ఆర్బీకేలే. గతంలో గ్రామస్థాయిలో రైతుల ఆలనాపాలనా పట్టించుకునే అధికారే ఉండేవారు కాదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని మాకు అండగా రైతు భరోసా కేంద్రాలు వచ్చాయి.

– నక్కా పవన్‌కుమార్, పెరికీడు

వ్యవసాయదారుకు వెన్నెముక



బాపులపాడు మండలం వేలేరులో రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాను. గతంలో పంటసాగుకు అధిక వడ్డీలకు అప్పు చేయాల్సి వచ్చేది. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏటా ప్రతి రైతుకు పెట్టుబడి సాయం క్రింద రైతుభరోసా పథకం ద్వారా రూ.13,500 అందించటం ఎంతో ఊరటను ఇస్తుంది. ఆర్బీకేల్లో రాయితీపై విత్తనాలు, ఎరువులు అందుకుంటున్నాను. వ్యవసాయ అసిస్టెంట్‌ను సంప్రదిండంతో మంచి పంట దిగుబడి సాధిస్తున్నా.

– ఎండీ కరిముల్లా, వేలేరు

ఏటా రైతుభరోసా



పెట్టుబడి సాయం కింద ఏటా ప్రభుత్వం ద్వారా రూ.13,500 లబ్ధి పొందుతున్నాను. దీంతో వ్యవసాయంతో కాస్త ఒడుదుడుకులను ఎదురైనా తట్టుకునే ధైర్యాన్ని ప్రభుత్వం ఇచ్చింది. ఆర్బీకేల ద్వారా వ్యవసాయానికి ఏ అవసరమైనా మా గ్రామంలోనే అందుతున్నాయి. ధాన్యం కొనుగోలు కూడా దళారులను ఆశ్రయించకుండా నేరుగా ఆర్బీకేల్లోనే విక్రయించటంతో ఎంతో లబ్ధి పొందుతున్నాం.

– అన్నె అనిల్‌కుమార్, ఆరుగొలను

పోలీస్ సర్కిల్ కార్యాలయం నిర్మాణానికి రూ.4 లక్షల విరాళం



ఎమ్మెల్యే వంశీమోహన్ సమక్షంలో విరాళం అందజేస్తున్న నెక్కలపూడి హరికిరణ్

హనుమాన్‌జంక్షన్ రూరల్: సమాజాభివృద్ధికి సామాజిక బాధ్యతతో ఇతోధికంగా విరాళాలు అందిస్తున్న పారిశ్రామికవేత్త, ఎస్‌జీ ఫీడ్స్ అధినేత నెక్కలపూడి హరికిరణ్ అభినందనీయుడని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. హనుమాన్‌జంక్షన్‌లో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ సర్కిల్ కార్యాలయం భవన నిర్మాణానికి నెక్కలపూడి హరికిరణ్ రూ.4 లక్షల విరాళాన్ని అందించారు. ఈ మొత్తాన్ని బాపులపాడు మండలం ఆరుగొలనులోని ఎస్‌జీ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో ఎమ్మెల్యే వంశీమోహన్ చేతుల మీదగా భవన నిర్మాణ కమిటీ సభ్యుడు, సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తికి బుధవారం అందించారు. కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, గన్నవరం ఏఎంసీ డైరెక్టర్ పసుపులేటి మురళి, తిప్పనగుంట పీఏసీఎస్ చైర్మన్ మూల్పూరి ప్రభుకాంత్, సర్పంచ్ కలపాల భీమయ్య, మాజీ సర్పంచ్ ఊబా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి



కంకిపాడు సెంటరులో నిరసన ర్యాలీ చేస్తున్న వలంటీర్లు, నాయకులు

కంకిపాడు: తమను కించపరుస్తూ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ వలంటీర్లు భారీ నిరసన చేపట్టారు. పవన్ కల్యాణ్ వలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అసాంఘిక శక్తులుగా వలంటీర్లు మారారంటూ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వలంటీర్లు బుధవారం కంకిపాడు ప్రధాన సెంటరులో నిరసన చేపట్టారు. వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన నిరసన ప్రదర్శన బస్టాండు సెంటరు, పోలీసు స్టేషన్, సినిమాహాలు సెంటరు వరకూ సాగింది. పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ డౌన్ డౌన్ పవన్ కల్యాణ్, బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ నినాదాలు చేశారు. అద్దె పార్టీ నాయకుడు, ప్యాకేజీ స్టార్ డౌన్ డౌన్ అంటూ విమర్శించారు. బహిరంగంగా క్షమాపణ చెప్పే వరకూ ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టంచేశారు. వలంటీర్లు చేపట్టిన ఆందోళనకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు మద్దతు పలికారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, రాచూరి చిరంజీవి, కలపాల వజ్రాలు, లంక వెంకయ్య, మట్టా నాగరాజు తదితరులు పాల్గొన్నారు. వలంటీర్లు శాంతియుత మార్గంలో ఆందోళన చేస్తుంటే జనసేన నేతలు కవ్వింపు చర్యలకు దిగారు. వలంటీర్ల ర్యాలీని జనసేన నాయకులు వెంబడిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. జనసేన నేతలు ఎంత కవ్వించినా వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు శాంతియుతంగా ఆందోళన, నిరసన కొనసాగించారు.

ఉంగుటూరు పీహెచ్‌సీ భవనం ప్రారంభం

ఉంగుటూరు: రోగులు ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించాలనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించి నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేస్తున్నారని గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. మండల కేంద్రమైన ఉంగుటూరులో నాడు నేడు నిధులు రూ.1.68 కోట్లు నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని ఎమ్మెల్యే వంశీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు నిరంతరం ఉచిత వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా ఇక్కడ 24 గంటలు వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. నిత్యం సిబ్బంది అందుబాటులో ఉండేందుకు వీలుగా తన సొంత నిధులతో ఇక్కడ నివాసగృహాలు ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. డీఎంహెచ్‌ఓ జి.గీతాబాయి మాట్లాడుతూ పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లతో 14 మంది సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. 63 రకాల ఉచిత వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, 260 రకాల మందులు కూడా రోగులకు అందిస్తున్నట్లు వివరించారు. అక్టోబర్ నెల నుంచి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని, తద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు చేరువ కానున్నట్లు తెలిపారు. అందుకు తగిన విధంగా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందన్నారు. ఈ అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, గన్నవరం ఏఎంసీ చైర్మన్ అంజనాదేవి, ఎంపీపీ వి.సరోజిని, డెప్యూటీ డీఎంహెచ్‌వో విజయభారతి, ఉంగుటూరు, పొనుకుమాడు సర్పంచులు కాటూరి వరప్రసాద్, అన్నే సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు బొత్స సింహాచలం, మండల వైద్యాధికారులు డాక్టర్ కె.వాణి, ప్రసన్న, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

జనసేన శ్రేణుల కవ్వింపు చర్యలు

- సచివాలయం బోర్డు ధ్వంసం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే పార్థసారథి



జనసేన శ్రేణులు ధ్వంసం చేసిన సచివాలయ బోర్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: జనసేన శ్రేణులు కవ్వింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. సచివాలయ గోడలపై జై జనసేన అంటూ రాసి రెచ్చగొట్టే ధోరణి అవలంబిస్తున్నాయి. సచివాలయ బోర్డును ధంసం చేసి విష రాజకీయాలకు శ్రీకారం చుట్టాయి. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలోని బీసీ కాలనీ సచివాలయం -2 గోడలపై జై జనసేన అని రాయటంతో పాటు, సచివాలయం బోర్డును ధ్వంసం చేసి, దానిపై కాషాయం రంగు పూశాయి. బుధవారం వెలుగుచూసిన ఈ ఘటన గ్రామంలో కలకలం రేపింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘటనాస్థలాన్ని సందర్శించారు. జనసేన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ జరిగిన పరిణామాలపై చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖకు విజ్ఞప్తిచేసింది.

పవన్ కల్యాణ్‌కు అవగాహనా రాహిత్యం

ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న సచివాలయ, వలంటీరు వ్యవస్థను విమర్శించటం బట్టి జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు కనీస అవగాహన లేదని అర్థమవుతోందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి విమర్శించారు. ఈడుపుగల్లు సచివాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. వలంటీరు వ్యవస్థను ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టి కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించిందని గుర్తుచేశారు. స్వయంగా ప్రధానమంత్రి అభినందించి, ఇతర రాష్ట్రాలు కూడా అవలంబించాలని సూచించారని పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు అందాలంటే రాజకీయ నాయకుల దయ ఉండాల్సి వచ్చేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా లబ్ధి చేకూరుతోందని వివరించారు. వలంటీర్లు స్వచ్ఛందంగా సేవ చేస్తున్నా బానిసలు అంటూ పవన్‌కల్యాణ్ విమర్శించటం సిగ్గుచేటన్నారు. వ్యవస్థను నీరుగార్చే యత్నం చేస్తున్న విషరాజకీయాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కంకిపాడులో శాంతియుతంగా వలంటీర్లు నిరసన తెలుపుతుంటే జనసేన నేతలు రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరించటం దారుణమన్నారు. పోలీసులు నిమ్మకుండిపోవడం బాధాకరమన్నారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని స్పష్టంచేశారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, నాయకులు వీరమాచనేని శ్రీనివాసరావు, బిళ్లా వెంకటేశ్వరరావు, నెరుసు సతీష్, వల్లె నరసింహారావు, మాదు శ్రీహరిరాణి, షేక్ సుభాని, నకరికంటి శేఖర్, షేక్ జమాల్, చింతల అప్పారావు, ఎంపీటీసీ సభ్యులు బూరగ బాలాజీ, షేక్ అమీనాబి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యం

గన్నవరంరూరల్: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ అనగాని రవి అన్నారు. మండలంలోని గొల్లనపల్లి గ్రామ సచివాలయం వద్ద బుధవారం ఎంపీడీవో సత్యకుమార్ అధ్యక్షతన జగనన్న సురక్ష క్యాంప్ జరిగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎ.ఎలిజబెత్‌రాణి, ప్రత్యేకాధికారి దుర్గా ప్రసాద్, సర్పంచ్ జి.శాంతి, డెప్యూటీ తహసీల్దారు అరుణ్ బాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పడమట సురేష్, ఎంపీటీసీ సభ్యురాలు మోరం నాగరాణి, పంచాయతీ కార్యదర్శి మారుతీ ప్రసాద్, సచివాలయం కార్యదర్శి ఎస్.శివనాగరాజు పాల్గొన్నారు.

110 మందికి నేత్ర పరీక్షలు

కంకిపాడు: కంటిని నిర్లక్ష్యం చేయొద్దని ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ సూచించారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం బుధవారం జరిగింది. 110 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ఉంగుటూరు: అవినీతికి తావు లేకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ వి.సరోజిని అన్నారు. తరిగొప్పులలో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు కావలసిన సేవలను గ్రామంలోనే అందించేందుకు ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చిందన్నారు. అనంతరం సచివాలయ ఆవరణలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 325 మందికి కుల ధ్రువీకరణ పత్రాలు, 341 మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, సీసీఆర్‌సీకార్డులు 15, 26 మందికి ఆధార్ మొబైల్ లింకు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిత, ఎంపీడీవో శేషగిరిరావు, ఈవోఆర్‌డీ బాషా, ఎంపీటీసీ నటరాజన్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు వరం



గండిగుంటలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ విమాదేవి



పెనమలూరులో సర్టిఫికెట్ అందజేస్తున్న సర్పంచి లింగాల భాస్కరరావు, మండల ప్రత్యేకాధికారి



ఉప్పలూరులో ఎస్టీలకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఉయ్యూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు వరమని ఎంపీడీఓ విమాదేవి అన్నారు. మండలంలోని గండిగుంట సచివాలయం-2లో జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం జరిగింది. 823 మంది లబ్ధిదారులకు 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందించారు. సర్పంచ్ గెత్తం అనుపమ, ఎంపీటీసీ సభ్యుడు బండెల శ్రీనివాసరావు, తహసీల్దార్ మస్తాన్, వైఎస్సార్ సీపీ నాయకుడు గెత్తం విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఉయ్యూరు 10, 12 వార్డుల సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, అడపాక రాంబాబు, బొబ్బిలి నాగరాజు పాల్గొని 211 మందికి ధ్రువీకరణ పత్రాలు అందించారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరిస్తున్నామని పెనమలూరు సర్పంచి లింగాల భాస్కరరావు అన్నారు. పెనమలూరు సచివలయం-2లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచి భాస్కరరావు మాట్లాడుతూ.. గతంలో ఎప్పుడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. మండల ప్రత్యేకాధికారి ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మండల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో అనేక సమస్యలను పరిష్కరించామన్నారు. ఎంపీడీఓ సునీతాశర్మ, ఏఓ లోమశివశంకర్, ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఎంఈఓ శేషగిరిరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. 204 సరిఫికెట్లను అందజేశారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కంకిపాడు: అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఉప్పలూరులో జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం జరిగింది. ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మేలు చేసే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందన్నారు. ఇంటింటి సర్వేలో గుర్తించిన సమస్యలను పరిష్కరించటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సేవలు ఉచితంగా అందించేలా ప్రణాళిక రూపొందించారని వివరించారు. తహసీల్దార్ పి.ఎస్.వి.ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయ్‌భాస్కర్, సర్పంచ్ లాం సోనియా, ఎంపీటీసీ లాం పార్వతి, పీఏసీఎస్ చైర్మన్ మాగంటి శ్రీనివాసరావు, బండెల సుబ్బారావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మాకు గుర్తింపు వచ్చింది



ఇప్పటి వరకూ మాకు ఎలాంటి గుర్తింపు కార్డులు లేవు. ఇన్నాళ్లకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాకు నివాసం, పుట్టినరోజు, కుల ధ్రువీకరణ పత్రాలు అందాయి. ఎస్టీ కులానికి చెందిన మా వర్గానికి గుర్తింపు పత్రాలు లభించటం చాలా ఆనందంగా ఉంది.

– బొజ్జా పోలమ్మ, లబ్ధిదారురాలు, ఉప్పలూరు

అర్హత వచ్చింది



ఇప్పటి వరకూ మాకు ఎలాంటి గుర్తింపు పత్రాలు లేవు, పథకాలు అందలేదు. ఇన్నాళ్లకు మాకు జగనన్న సురక్ష ద్వారా ఒక అండ దొరికింది. మా సామాజిక వర్గానికి ధ్రువీకరణ పత్రాలు అందాయి. ఇప్పుడు సంక్షేమ పథకాలు అందుకునేందుకు అర్హత వచ్చింది.

– పొన్నం భవాని, ఉప్పలూరు

నగర మార్కెట్‌లోకి హ్యుందాయ్ ఎక్స్‌టర్



రామవరప్పాడు: చిన్నతరహా ఎస్‌యూవీ హ్యుందాయ్ ఎక్స్‌టర్ కారును రామవరప్పాడులోని స్వర్ణ హ్యుందాయ్ షోరూమ్‌లో బుధవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ టి.కనకరాజు మార్కెట్‌లోకి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూమ్ జనరల్ మేనేజర్ భగత్‌సింగ్ మాట్లాడుతూ ఈ నూతన ఎక్స్‌టర్ కారు 1.2 లీటర్ పెట్రోల్ ఇంజన్‌లో మాన్యువల్, ఆటోమేటిక్ రకాలలో లభిస్తుందని తెలిపారు. 5 స్పీడ్ మాన్యువల్ ట్రిమ్ లీటర్ పెట్రోల్‌కు 19.4 కిలోమీటర్లు, 5 స్పీడ్ ఆటోమెటిక్ ట్రిమ్ 19.2, సీఎన్‌జీ ట్రిమ్ కేజీకి 27.1 మైలేజీ ఇస్తుందని తెలిపారు. ఫుట్‌వెల్ లైటింగ్, వాయిస్ ఆధారిత స్మార్ట్ ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, ఆరు ఎయిర్ బ్యాగ్స్, డ్యూయల్ కెమెరాతో డ్యాష్ బోర్డు, ఏబీఎస్, హిల్ స్టార్ట్ అసిస్ట్ కంట్రోల్, పార్కింగ్ అసిస్ట్ వంటి అత్యాధునిక సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ కారు ఎక్స్‌షోరూమ్ ధర రూ 5.99 లక్షల నుంచి 9.31 లక్షల వరకు ఉందని వివరించారు. కార్యక్రమంలో యూట్యూబర్ మూర్తినాయుడు, షోరూమ్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.